ఎస్ఆర్‌డీపీ పనులతో మంచి ఫలితాలు

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ఎస్ఆర్‌డీపీలో చేపడుతున్న అభివృద్ధి పనులపై గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే వివేకానంద్ ప్రస్తావించారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎస్ఆర్‌డీపీ ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడారు. స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఆర్‌డీపీ) కింద నగర నలుమూలల చేపడుతున్న ఫ్లైఓవర్లు, రోడ్ల అభివృద్ధి పనుల ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు.

- అయితే సికింద్రాబాద్ పారడైజ్ నుంచి బోయిన్‌పల్లి వరకు సిఖ్ విలేజ్ మీదుగా.. ప్యాట్నీ నుంచి కరీంనగర్ వెళ్లే రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు.
- డిఫెన్స్‌శాఖ ఆధీనంలో ఉన్నందున ఎస్ఆర్‌డీపీ కింద అభివృద్ధి పనులు చెప్పట్టలేక పోతున్నామని సమస్య పరిష్కారానికి డిఫెన్స్ శాఖ నుంచి అనుమతి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు.
- అదే విధంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ నుంచి జేఎన్‌టీయూ వైపు వెళ్లే రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని సమస్య పరిష్కారానికి ఎస్ఆర్‌డీపీ కింద ఫ్లై ఓవర్ చేపడితే బాచుపల్లి, ప్రగతి నగర్, భౌరంపేట్, మల్లంపేట్ ప్రాంత ప్రజలకు వెసులుబాటు కలుగుతుందన్నారు.
- బాచుపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఎస్ఆర్‌డీపీ కింద బాచుపల్లి వద్ద ఫ్లైఓవర్, మల్లంపేట్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ – ఎంట్రీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.



అసెంబ్లీ సమావేశాల్లో సమస్యలను ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం

- దీనిపై మంత్రి కేటీఆర్ సమాధానం ఇస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ఇప్పటికే అనేక పనులు పూర్తి చేశామన్నారు. మిగిలిన పనులు కూడా పూర్తి చేసి హైదరాబాద్ నగర ప్రజలకు పూర్తి స్థాయిలో ఎస్ఆర్‌డీపీ ఫలాలు అందిస్తామని తెలిపారు.
- హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలు అధిగమించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈ పనులన్నీ వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు.
- కంటోన్మెంట్ ప్రాంతం గుండా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ఎనిమిది ఏళ్లుగా ప్రతీ రక్షణ శాఖ మంత్రిని, పలుమార్లు ప్రధాన మంత్రిని కలిసి వినతులు, విజ్ఞప్తి చేస్తున్నా అనుమతులు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.
- పాట్నీ నుంచి సుచిత్ర వరకు స్కైవే కట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదన్నారు. ప్రజల అవసరాల మేరకు చేపట్టే పనుల విషయంలో కేంద్రం వివక్ష చూపడం సరైన పద్ధతి కాదని, ఇకనైనా ముందుకు రావాలని అన్నారు.
- సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులో స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.56 కోట్ల నిధులు, మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.
- జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వైపు హెచ్ఎండీఏ పరిధిలో పెద్ద ఎత్తున హైరైజ్ కమ్యూనిటీలు రావడంతో ఒక గ్రామం మాదిరిగా జనాభా పెరుగుతుందన్నారు.
- కొంపల్లి ప్రాంతంలో గేట్ వే, ఐటీ పార్కుల ఏర్పాటు నేపథ్యంలో రాబోయే రోజుల్లో పెరిగే జనాభాను అంచనా వేసి ఎస్ఆర్‌డీపీ కింద రోడ్ల వెడల్పు, జంక్షన్ల అభివృద్ధి, లింకు రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఎస్ఎన్‌డీపీ కింద నాలాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో ఆటంకం కలుగనుందని కొంపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలోని కల్యాణ్‌గార్డెన్స్, గంగా ఎన్‌క్లేవ్, ఎస్ఎంఆర్ గార్డెన్స్, రంగారెడ్డి బండ ప్రాంతాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు...

- అదే విధంగా సన్మాన్ ఫీడర్ పరిధిలో ఉడ్స్‌కాలనీ, సన్మాన్‌కాలనీ, యాదిరెడ్డి బండ, వైష్ణవి మీడోస్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఇది గమనించి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

కరోనా లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్-19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 17 మందికి కోవిడ్ పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్ట్‌లు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పుల లక్షణాలతో రోగుల తరబడి బాధపడే వారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాజీచైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీగా కె.వెంకట్రామిరెడ్డి



కుత్బుల్లాపూర్: మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీగా కె.వెంకట్రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన రిపోర్ట్ చేశారు. డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వెంకట్రామిరెడ్డి మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ అయ్యారు. మేడ్చల్ ఏసీపీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభం కానున్న బాలానగర్‌లోని మేడ్చల్ డీసీపీ కార్యాలయం భవనంలోని ఏసీపీ కార్యాలయ నుంచే ఆయన విధులు నిర్వహించనున్నారు.

జల్దా రాఘవులు.. మీ సేవలు ఇక చాలు!

- సంతకాల సేకరణ చేపట్టిన గాంధీనగర్ బస్తీవాసులు

కుత్బుల్లాపూర్: పదవీ కాలం ముసిగిన కొనసాగుతున్న గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న జల్దా రాఘవులు తన పదవికి రాజీనామా చేసి కొత్త కమిటీకి అవకాశమివ్వాలని బస్తీవాసులు గురువారం ఆయనకు లేఖ రాశారు. పాత కమిటీ పదవీ కాలం 2020లో ముగిసినా నేటికీ కొనసాగుతోందన్నారు. దీంతో బస్తీలో అభివృద్ధి కుంటుపడిందని పలువురు పేర్కొన్నారు. నాలుగేళ్లుగా పదవిలో కొనసాగుతున్న జల్దా రాఘవులు, పాత కమిటీ సభ్యులు పదవీ కాంక్షను వదిలిపెట్టి కొత్త కమిటీ ఎన్నికకు మార్గం సుగుమం చేయాలని కోరుతూ బస్తీవాసులు సంతకాల సేకరణ చేపట్టి ఆయన అందజేశారు.

వైభవంగా ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎన్‌క్లేవ్‌లోని శ్రీపద్మావతి గోదా సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి నిర్వహించిన అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్‌సింహారెడ్డి బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, సురేష్, వేణుగోపాల్, కిరణ్, రాజశేఖర్‌రెడ్డి, పుష్పాల భాస్కర్, నర్సారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

సుభాష్‌నగర్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్‌సే హాత్ జోడ్ యాత్రలో భాగంగా గురువారం ఆయన సూరారంకాలనీ పరిధిలోని సాయిబాబానగర్ చౌరస్తా, కృషికాలనీ, హమీద్ బస్తీ, అంజిరెడ్డి బస్తీ, పుష్పగిరి బస్తీ, శ్రీను బస్తీ, పాండు బస్తీ తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ గడపగడపకు 'హాత్‌సే హాత్ జోడో స్టిక్కర్‌ను అతికించి కరప్రతాలు పంచి పెట్టారు.

- కొలన్ హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటని అన్నారు. నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, జేమ్స్, శ్రీధర్‌రెడ్డి, వీరేష్, గురువారెడ్డి, రాంచందర్, హేమరాణి, పండరిరావు తదితరులు ఉన్నారు.



శ్రీనుబస్తీలో కరపత్రాలు అందజేస్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

డిమాండ్ నోటీసుల్లోని మొత్తాన్ని విడతలుగా చెల్లించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లయ్య

రంగారెడ్డినగర్: జీఓ.59 కింద డిమాండ్ నోటీసులు అందుకున్న లబ్ధిదారులు వెంటనే డబ్బులు చెల్లించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆర్డీఓ మల్లయ్య అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధిలోని దేవమ్మబస్తీ, నందానగర్‌లలో తహసీల్దార్ సంజీవ్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డిలతో కలిసి ఆయన లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేశారు. డిమాండ్ నోటీసుల్లో మొత్తాన్ని మూడు విడతలుగా మార్చి 31లోగా చెల్లించాలని కోరారు. నోటీసుల్లో పేర్కొన్న రుసుం మారుతుందనే పుకార్లను నమ్మవద్దన్నారు. ఒక వేళ గడువు తేదీలోగా మొత్తం రుసుం చెల్లించని పక్షంలో దరఖాస్తు రద్దవుతుందని స్పష్టం చేశారు.

వీఎన్ఆర్–విజేఐఈటీలో స్పోర్ట్స్ ఫెస్ట్ షురూ





స్పోర్ట్స్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న అర్జున పురస్కార గ్రహీత చేతన్ ఆనంద్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్-వీజేఐఈటీ కళాశాలలో 14వ అఖిల భారత ఓపెన్ సెంటర్ ఇంజినీరింగ్ కాలేజియేట్ స్పోర్ట్స్ ఫెస్ట్ గురువారం ప్రారంభమైంది. అర్జున పురస్కార గ్రహీత చేతన్ ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ఫెస్ట్‌లో పలు రాష్ట్రాలకు చెందిన 52 కళాశాలల నుంచి జట్లు పాల్గొనగా బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, వాలీబాల్, క్రికెట్ క్రీడలు జరుగనున్నాయని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీరామ తెలిపారు. ఈ సందర్భంగా చేతన్ ఆనంద్ మాట్లాడుతూ... వ్యక్తిగత క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలన్నారు. కళాశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సీడీ నాయుడు మాట్లాడుతూ.. జయాపజయాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తితో అన్ని కళాశాలల విద్యార్థులు పోటీ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ చెన్నకేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. పట్టించుకుంటే వింత!

- ఏడాదిగా గుంతల రోడ్డుపైనే ప్రయాణం
- దుమ్ము, ధూళితో ఇబ్బందులు
- విన్నపాలు, ఫిర్యాదులు బేఖాతరు
- అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే దారిలో కంకర తేలిన రోడ్డు

జీడిమెట్ల: జీడిమెట్ల నుంచి దూలపల్లి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డుకు మరమ్మతులు నిర్వహించడంలో కొంపల్లి మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడ చివరి గేటు నుంచి దూలపల్లి రోడ్డులో దాదాపు 400 మీటర్ల మేర రోడ్డు పూర్తిగా కంకరతేలింది. ఈ విషయమై వాహనదారులు మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం మాత్రం శూన్యమని వాహనదారులు ఆరోపిస్తున్నారు. 400మీటర్ల మేర దూలపల్లి మున్సిపల్ అధికారులు సీసీ రోడ్డు వేయాలని వాహనదారులు సంవత్సర కాలంగా కోరుతున్నారు. అయినా అధికారులు రోడ్డు మరమ్మతులకు ముందుకు రాకపోవడంపై వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అడుగుకో గుంత.. కంకర తేలిన వైనం.. రేగుతున్న దుమ్ము..

సదరు రోడ్డు చాలా వరకు గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు కంకర తేలి రోడ్డు కాస్తా మట్టి రోడ్డును తలపిస్తోంది. వాహనాలు వెళ్లే క్రమంలో దుమ్ము లేవడంతో పరిసరాల ప్రజలు, దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము నుంచి ఉపశమనం లభించాలంటే రోడ్డు వేయడమే మార్గమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

జీడిమెట్ల నుంచి నిత్యం వందలాది వాహనాల రాకపోకలు..

ప్రతినిత్యం జీడిమెట్ల పారిశ్రామికవాడకు ఇదే రోడ్డులో లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జీడిమెట్ల నుంచి రింగ్‌రోడ్డుకు, ముంబాయికి వెళ్లే వాహనాలు ఇదే రోడ్డులో రాకపోకలు వచ్చి వెళ్తుంటాయి. కావున అధికారులు పట్టించుకుని 400 మీటర్ల మేర సీసీ రోడ్డు వేయించాలని డ్రైవర్లు కోరుతున్నారు.



వాహనాలు వెళ్లే క్రమంలో వెలువడుతున్న దుమ్ము

బండ్లు ఖరాబైతున్నాయి..



నేను ప్రతిరోజు ఇదే రోడ్డుపై నిత్యం పదులసార్లు లోడింగ్ అన్‌లోడింగ్ నిమిత్తం వెళ్తుంటాను. రోడ్డుపై గుంతలుగా ఉండటంతో లోడింగ్‌తో వెళ్లినపుడు కొన్నిసార్లు మా బండ్లు రోడ్డుపైనే ఖరాబైతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నాం. – కార్తీక్, డ్రైవర్

క్రైం కార్నర్..

పెళ్లి కావడంలేదని యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల: పెళ్లి కావడంలేదన్న మనస్థాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ పవన్ వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కృష్ణకుమార్ కుటుంబంతో కలిసి హెచ్ఏఎల్‌కాలనీలో ఉంటున్నాడు. వీరితో పాటు కృష్ణకుమార్ సోదరుడు బాలాకుమార్(26) సోదరుడితో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కాగా బాలకుమార్‌కు ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా కుదరడం లేదు. ఈ విషయంలో బాలకుమార్ తనలో తానే ఆలోచిస్తూ మదనపడేవాడు.బుధవారం మధ్యాహ్నం కృష్ణకుమార్, అతని భార్య విధులకు వెళ్లగా బాలకుమార్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. భార్యాభర్తలిద్దరు తిరిగి రాత్రి వచ్చి చూసేసరికి బాలకుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెంది ఉన్నాడు. మృతుడి సోదరుడు కృష్ణకుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్ విఫలయత్నం కేసులో నిందితుల రిమాండ్

జీడిమెట్ల: మహిళ మెడలోంచి గొలుసు దొంగిలించేందుకు యత్నించిన ఇద్దరిని జీడిమెట్ల పోలీసులు రిమాండుకు తరలించారు. సీఐ పవన్ వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లో నివాసముండే కార్తిక్(23) ఓ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సులువుగా డబ్బు సంపాదించాలన్న ఆశతో దొంగతనం చేయాలనుకున్నాడు. అనుకున్న విధంగా ఓ మైనర్ బాలుడితో జతకట్టాడు. మంగళవారం కళావతినగర్‌ను ఎంచుకున్నాడు. రాత్రి డ్యూటీ ముగించుకుని దేవి అనే మహిళ ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో కార్తిక్ నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోంచి గొలుసు తెంపగా వెంటనే తేరుకున్న దేవి కేకలు వేయడంతో కార్తిక్ గొలుసును అక్కడే వదిలేసి ద్విచక్ర వాహనంపై సిద్ధంగా ఉన్న మైనర్ బాలుడితో కలిసి పారిపోయాడు. దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కార్తిక్‌ను గుర్తించారు. కార్తిక్, మైనర్ బాలుడిని గురువారం రిమాండుకు తరలించారు.

టార్గెట్స్ పెట్టి ఆస్తిపన్ను వసూలయ్యేలా చూడాలి



ఆస్తిపన్ను వసూలుపై అధికారులకు సూచనలు చేస్తున్న జోనల్ కమిషనర్ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో గురువారం ఆస్తిపన్నుపై సంబంధిత అధికారులతో జోనల్ కమిషనర్ వి.మమత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా బిల్ కలెక్టర్లు, టాక్స్ ఇన్‌స్పెక్టర్లకు రోజువారీ, నెలవారీ టార్గెట్స్ విధించి వసూలు అయ్యేలా చూడాలని ఉప కమిషనర్లను ఆదేశించారు. ఉప కమిషనర్లు వారంలో రెండుసార్లు ఉదయం, సాయంత్రం ప్రతి బీసీ, టీఐల పన్ను వసూళ్ల టార్గెట్స్‌పై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

- సర్కిళ్లలోని సహాయ మున్సిపల్ కమిషనర్లకు తగు సూచనలు జారీ చేయాలని ఆదేశించారు. ఆస్తిపన్ను విభాగం అధికారులు ప్రతిరోజు ఉదయం 8గంటల వరకు క్షేత్రస్థాయిలో ఉండి సర్కిల్ వాట్సప్‌లలో పోస్ట్ చేయాలని సూచించారు. లేకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
- సర్కిల్ సహాయ మున్సిపల్ కమిషనర్లు వారికి సంబంధించి తక్కువ కలెక్షన్ అవుతున్న ప్రాంతాల్లో ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. లేకపోతే వారిపై ఏప్రిల్ నెలలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఉప కమిషనర్లు వార్వారి సర్కిళ్లలోని పాత బకాయిల ప్రకారం ఏఎంసీలు అందరూ ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు.
- రోజువారీ టార్గెట్ విధించి వివరాలు జోనల్ కమిషనర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. డీసీలు రవికుమార్, రవీందరకుమార్, మంగతాయారు, నాగమణి, సహాయ మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళ్ల సమస్యలను దూరం చేసేందుకే 'కంటివెలుగు'



కళ్లద్దాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: పేదల కళ్ల సమస్యలను దూరం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగును తీసుకువచ్చిందని దుండిగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అన్నారు. డీపోచంపల్లిలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. కంటివెలుగుతో పేదల కంటి సమస్యలు తొలగనున్నాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు నిర్వహించుకోవాలని కోరారు. అవసరమైన వారికి శిబిరంలోనే ఉచితంగా కళ్లద్దాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, డాక్టర్ నిర్మల, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు రమాదేవి, సాయియాదవ్, మహేందర్‌యాదవ్, శంభీపు కృష్ణ, నవిత తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సూరారం కట్టమైసమ్మ జాతర

సూరారం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండో అతిపెద్ద జాతరగా సూరారం కట్టమైసమ్మ జాతర పేరొందింది. ఎన్నో ఏళ్లుగా మైసమ్మ అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఈ జాతర కొనసాగనుంది.

ఆలయ చరిత్ర..

నిజాం హయాంలో షేక్ అబ్దుల్ పాషా నవాబ్ సంస్థానంలో సూరారం గ్రామం భాగంగా ఉండేది. అప్పట్లో సూరారం గ్రామానికి చెరువును తవ్వించి కట్ట నిర్మించగా పలుమార్లు ఆ కట్ట కూలిపోయింది. దీంతో చెరువు పనుల్లో కూలిగా పని చేస్తున్న సూరయ్య అనే గ్రామస్తుడు ఈ విషయమై నవాబు వద్దకు వెళ్లి కట్ట పదే పదే కూలిపోతోందని, అక్కడ కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తే బాగుంటుందని తెలిపాడు. దీంతో చెరువు కట్టను నిర్మించి దానిపై మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించగా కట్ట కూలిపోకుండా అలాగే నిలిచింది. అంతే కాకుండా అమ్మవారిని దర్శించుకుని కోర్కెలు కోరే భక్తుల అభీష్టాలను తీర్చే కల్పతరువుగా విరాజిల్లుతూ వచ్చింది.

ఈ నేపథ్యంలో 1999లో కట్ట మీదుగా వెళ్తున్న ఓ డీసీఎం వాహనం అదుపు తప్పి అమ్మవారి గుడికి పక్కనే ఉన్న వేప చెట్టును ఢీకొట్టడంతో అమ్మవారి విగ్రహం స్థానభ్రంశం జరిగింది. దీంతో ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించిన గ్రామస్తులు, భక్తులు 2002 ఆలయాన్ని పూర్తి చేసి అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతిఏటా మాఘమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శని, ఆది, సోమవారాల్లో జాతర నిర్వహిస్తూ వస్తున్నారు.

జాతర వివరాలు..

సూరారం చెరువు కట్టపై వెలిసిన కట్టమైసమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు ఈనెల 11న ప్రారంభం కానున్నాయి. నగరంతో పాటు మెదక్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.



సూరారంలోని కట్టమైసమ్మ,రేణుక ఎల్లమ్మల ఆలయం

- 11వ తేదీ జాతర మొదటి రోజు ఉదయం 5గంటలకు సుప్రభాతసేవ, పంచామృత స్నానంతో జాతర మొదలవుతుంది. ఉదయం 8 గంటలకు పుణ్యావాచనము, గణపతి పూజ, అంకురార్పణ, దీక్షాధారణ, అగ్రిప్రతిష్ఠ, నవవర్ణ జపహోమం, మధ్యాహ్నం 12గంటలకు కల్యాణం, తలంబ్రాలు, ఓడిబియ్యం సమర్పణ, సాయంత్రం 5గంటలకు సూరారంలోని శ్రీరామాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుంది.
- 12వ తేదీ ఉదయం 5గంటలకు ప్రత్యేక అలంకరణ, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడిబియ్యాలు, బోనాల సమర్పణ, మొక్కుబడులు చెల్లింపులు,
- 13వ తేదీన రంగం, భవిష్యవాణి, పోతరాజుల విన్యాసాలు, ఫలహారబండి ఊరేగింపు ఉంటాయి.
- 15వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు అన్నదానం కార్యక్రమంలో జాతర మహోత్సవం ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం సికింద్రాబాద్, బాలానగర్ చౌరస్తా, నర్సాపూర్‌ల నుంచి ప్రతి 15 నిమిషాలకు ఓ బస్సు ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది.



ఆలయంలో కొలువైన కట్టమైసమ్మ అమ్మవారు

ట్రాఫిక్ మళ్లింపు..

కట్టమైసమ్మ జాతరను పురస్కరించుకుని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రి నుంచి జ్యోతి మిల్క్ ఫ్యాక్టరీ వరకు వన్‌వే చేసినట్లు జీడిమెట్ల సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. భారీ వాహనాలను సూరారం గ్రామం మీదుగా గండిమైసమ్మకు వెళ్లేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.